2-24

## మున్నుడి

జానపదుల కోసం వారిశైలికనుగుణంగా వారి భాషవాడుతూ అన్నమాచార్యులవారు అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు. ఆ మాటలు నేటి మన'ఆంగ్ల తెలుగు' మాత్రమే వచ్చిన నాబోటివారికి అర్థంకావు. వాడుకలో లేని కత్తి తుప్పువట్టినట్లు 600 ఏళ్ళలో కొన్ని మాటలు నిఘంటువుల్లో కూడా కనుమరుగయిపోయాయి. 'కూగాగు' అంటే సరియైన అర్థం ఏమిటి? భాషమీద పట్టువున్న నా మిత్రులొకరి సూచనమేరకు కన్నడంలో 'కూగాగు' తెలుగులో 'దోబూచి' గా అర్థం చెప్పవచ్చు. అన్నమయ్యవాడిన జానపద భాష ఇదమిత్థంగా తెలియదంలేదు. మన దౌర్భాగ్యం....

**కం॥ "కూగూగం" టే నేమిటి?**
**ఏగతి నేర్వంగనోపు ఇట్టి పదములన్**
**రాగదలె అన్నమయ్యకు**
**తూగే సరిజోడు కొలువ తోయజనాభున్!!!**

**రాగం : మోహన**

గుఱుతెఱిగిన దొంగ కూగూగు వీడె
గుఱిలోనె దాగీని కూగూగు ॥గుఱుతెఱిగిన॥

నెలతల దోచీని నీళ్ళాడగానే
కొలనిదరిని దొంగ కూగూగు
బలువైన వుట్ల పాలారగించీని
కొలది మీఱిన దొంగ కూగూగు ॥గుఱుతెఱిగిన॥

చల్లలమ్మంగ చనుకట్టు దొడికీని
గొల్లెతలను దొంగ కూగూగు
యిల్లిల్లు తప్పక యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ కూగూగు ॥గుఱుతెఱిగిన॥





తావుకొన్న దొంగ తగిలి పట్టండిదె
గోవులలో దొంగ కూగూగు
శ్రీవేంకటగిరి చెలువుండో యేమో
కావిదుడగు దొంగ కూగూగు. ॥గుఱుతెఱిగిన॥

**భావామృతం :**

'గుఱుతెఱిగిన దొంగ' అంటే జగత్ ప్రసిద్ధమైన చోరుడు అని అర్థం చెప్పుకోవచ్చు. వీడు జగత్ ప్రసిద్ధమైన దొంగ'దోబూచి'. అంతేకాక ఈయన భక్తుల గుఱిలోనె (లక్ష్యములోనే) దాగియుండే కూగూగు (దోబూచి).

కొలనులో స్నానం చేద్దామని స్త్రీలు నీళ్ళలో దిగగానే వాళ్ళ బట్టలను యెత్తుకొనిపోయిన దొంగ కూగూగు ఇతడే. పెద్ద 'ఉట్ల'లో ఎత్తుగా కట్టిన పాలుకూడ తెలివిగా కాజేసిన అపరిమితమైన దొంగ కూగూగు ఇతడే. (మన తెలివితేటలు ఆయన చాకచక్యం ముందు పనిచేస్తాయా? ఎంత వెర్రివాళ్ళం మనం!!)

చల్లలమ్ముకోవటానికి గొల్లభామలు నెత్తిన చల్లకుండలు పెట్టుకొని నడుస్తుంటే చనుకట్టు చలిస్తుండగా వాళ్ళవెంటబడి ఏడిపించే వాడే ఈ దొంగ కూగూగు. వీరూవారని గాక రేపల్లెలో ప్రతి గోపిక స్తనవైభవాపహరణ ఈ దొంగ కూగూగే గావించాడు. (ఎంత అదృష్టవంతులో!! సాక్షాత్తూ దేవతాస్త్రీలంతా, ఆ పురుషోత్తముని ప్రార్థించి, వరముగా పొంది, గోపికలవలె జన్మించి ఆ సౌభాగ్యాన్ని పొందారట. అదికదా! జన్మ అంటే)

ఈ మహనుభావుడు (నేడు తిరుమలలో) నెలకొనిన దొంగ. ప్రయత్నించి పట్టుకోండి (మీ తరమా?) గోవిందా అనండి. ఎందుకంటే ఈయన గోవులతో సంచరించే దొంగ కూగూగు. శ్రీ వేంకటగిరి మీద స్థిరపడిన సుందరాకారుడో ఏమో? అట్లా అయితే మాత్రం ఈ దొంగ కూగూగు జ్ఞానేశ్వరుడే. సందేహం లేదు.